శ్రీ కలువకొలను సదానంద

# స్థితి

ఆకాశపు టంచులకు ఎగబాకే పండువెన్నెల నవ్వులూ, ఇంకిపోయిన సముద్రాలనుసైతం కన్నీటి కెరటాలతో నింపగలిగిన ఏడుపులూ మనిషి జీవితంలోనే వున్నాయి.

అయితే, మనిషికి అస్తిత్వం లేదు. వచ్చేటప్పుడు వెంట తెచ్చుకునేదీ, పోయేటప్పుడు మోసుకుపోయేదీ మనిషికి ఏదీలేదు.

మనిషికిలేని అస్తిత్వం మృత్యువుకు వుండటమన్నదే విచిత్రం! నలభై ఏళ్ళ కిందట నవవధువు ఒకతె మొగుడి మునిపంటి నొక్కులను తీయగా భరించి, నవ్వుతూ నవ మాసాలు మోసి ముక్కీమూలిగి కెవ్వున కేకవేసే ఒక నర ప్రాణిని ప్రసవించి 'రుద్రమూర్తి' అని నామకరణం చేస్తే, పుట్టి బతుకుతున్నవాడు రుద్రమూర్తి అని వ్యవహరిస్తున్నాం మనం. నిజం అదికాదు. మృత్యువు పుట్టింది. రుద్రమూర్తిని వెంట తెచ్చుకొన్నది, అడివికి వేటకు వచ్చిన మహారాజు హాస్యగాణ్ణి వెంటబెట్టుకు వచ్చినట్లు! మృత్యువు పోతూ పోతూ రుద్రమూర్తిని ఎత్తుకుపోతుంది, రాచపీనుగు తోడు పీనుగుతో వెళ్ళినట్లు!

వేదాంతుల పరిభాషలో మనిషి మాయ కావచ్చు, జీవితం గాలిబుడగే కావచ్చు; అయితే నూరేళ్ళ దీర్ఘకాలనిమేషంలో ప్రచండ గ్రీష్మాలని అంటిపెట్టుకుని నూరు శరత్తులున్నాయి. పంచేంద్రియాలకే తప్ప ఇంద్రియాతీత జీవితానికి అందని పాంచభౌతికానందాలూ, కారుణ్య రసవాహినులకు జీవంపోసే సజీవ హృదయ స్పందనలూ వున్నాయి. అందుకే జీవితం విలువైనది!

మృత్యువు మనిషిని ఆడుకోనిస్తుంది, పాడుకోనిస్తుంది. తాను వేరు, జీవితం వేరుఅన్నట్లుగా నక్కుతూ నడయాడుతుంది. ఎప్పుడో వీలుచూసుకుని, వేటగాడు చెట్టుచాటున పొంచి పిట్టను కొట్టినంత పనిచేస్తుంది. అయితేనేం? జీవితం ఒక సరళరేఖ అనుకుంటే, మరణం ఒక బిందువు మాత్రమే!

మరణాన్ని జయించే మేధస్సు మనిషికి లేకపోవచ్చు. కానీ ప్రతి మనిషి జీవితాన్ని సరళ రేఖగాను, మరణాన్ని బిందువుగానూ నియంత్రించుకోగల వ్యవస్థను నిర్మించుకోలేనంత చవట కాదు మనిషి. అయితే మనిషి ఒంటరివాడు. స్వార్థపరుడు.

రుద్రమూర్తికి జీవితం సరళరేఖాకాదు, మృత్యువు బిందువూ కాదు. జీవితమే మరణం. ఏది జీవితమో, ఏది మరణమో తెలియని అద్వైత స్థితి అతని బతుకు. పుట్టినప్పటి నుంచీ కట్టెదుట తిష్ఠవేసుకుని, పట్టుకుపోయే ప్రయత్నంలోనే వుంది మృత్యువు. దొరికిపోయిన కేడీ రుద్రమూర్తి. దొంగల గుండెల్లో నిద్రపోయే బుర్రమీసాల పోలీసు—మృత్యువు. బందీ ఒంటేలు పోసుకోవాలన్నా, మర్మాంగంలా అంటిపెట్టుకునే వెంటవస్తాడు పోలీసు.

రుద్రమూర్తిని ఒక్కపెట్టుకు చావనివ్వలేదు మృత్యువు. ముక్కు అదిమి పట్టుకుంటే మూడు నిమిషాల్లో నిగుడుకునే కట్టెను నలభై ఏళ్ళనుంచీ నరకయాతనలు పెడుతూనే వుంది. రుద్రమూర్తి గుర గుర మంటూనే వున్నాడు, అమృతం తాగివచ్చిన పందిపిల్లలా.

లోకం అద్దెకొంప అంటాడు విరాగి. లోకంలో తనకో స్వంత యింటిని సంపాదించుకుంటాడు రాగి. ఉన్నవాడికి ఒక్క యిల్లయితే లేనివాడికి వెయ్యి యిళ్ళు అని సరిపెట్టుకుంటాడు ఆర్థికరోగి.

వెయ్యి యిళ్ళ యజమాని రుద్రమూర్తి తన ఆయుష్కాలం పూర్తయ్యే లోపున ఆ యిళ్ళన్నిట్లోనూ కాపురం చెయ్యాలని ముచ్చటపడ్డాడా కాబోలు, అతని జీవితమంతా ఇళ్ళు మార్చటంతోనే గడిచిపోయింది. మకాం పెట్టే వరకే అవి యిళ్ళు. ఆ తరవాత పులి బోనులు. బోనులోకి వెళ్ళి తలుపు మూసేసుకుని పులితో సహవాసం చెయ్యగలడా మనిషి? బోనులో నుంచి బయటపడటం, పరుగు, మళ్ళీ మరో బోను, మళ్ళీ పరుగు ... ఇదీ రుద్రమూర్తి జీవితం!

జెండా వీధిలోవున్న బోను తనది అనిపించుకోటానికి భగీరథ ప్రయత్నమే చేశాడు రుద్రమూర్తి. వారం రోజుల్లో ఆ యిల్లు ఖాళీ అవబోతుందనగా వెళ్ళి చూశాడతను. అందులో పండుముసలిది ఒకతె వుంటున్నది. ఆ యింట్లోనే రెండు నెలల క్రితం ఆమె మొగుడు పోయాడట. పొరుగూళ్ళో బెల్లం ముక్కలాంటి పెళ్ళాంతో కాపురం చేసుకుంటోన్న కొడుకు దగ్గరికి వెళ్ళిపోయి కోడలికి భారంగా బతకవలసి వస్తున్నది కదా అని కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది ముసలిది. ఇల్లంతా చూపించింది. ఇల్లు సౌకర్యంగా వుందని ఆమే అన్నది. వండి తినటానికి ఒక గదీ, తిని పడుకోటానికి ఒక గదీ వున్నాయి. పెరటిలో ఒక వైపు నుయ్యి, మరోవైపు ఫ్లెష్ ఔట్ లెట్రిన్, డాబా మెట్లూ వున్నాయి. కరెంటూ వుంది, మీటరూ వుంది. ''అద్దె ముప్పై రూపాయలిస్తున్నాం నాయనా! ఇప్పుడు మరో ఇరవై పెంచేటట్లున్నారు. ఇప్పటికే ఇద్దరు ముగ్గురొచ్చి చూసిపోయారు. ఈ యిల్లు నీకు దొరుకుతుందో లేదో!'' అన్నది ముసలిది.

"అవ్వా! ఈ యిల్లు ఎవరిది?" అని అడిగాడు రుద్ర మూర్తి.

"నంగా రంగారెడ్డిది."

"అదేమిటవ్వా? నంగ రంగారెడ్డి చచ్చిపోయి, ఇరవై ఏళ్ళ యింది కదా?"

"ఆయన పోతే ఏమి నాయనా? ఆయన కొడుకున్నాడుగా?"

నంగా రంగారెడ్డి కొడుకు నంగా పట్టాభి రామిరెడ్డి, స్కూల్ ఫైనల్ వరకూ రుద్రమూర్తితో కలిసి చదువుకున్నాడు. పట్టాభి తనమీద దయమాలి, యిల్లు మరొకరికి ఎలా యివ్వగలడన్న ధీమా కలిగింది రుద్రమూర్తికి.

వెంటనే లక్ష్మీనగర్‌కి వెళ్ళాడు. లక్ష్మీనగర్‌లో అన్నీ ఇంద్ర భవనాలే! ఇంట్లో పట్టాభి లేడు. ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకుని రైల్లో బస్సో ఎక్కి ఎక్కడో కాంచన ద్వీపానికి వెళ్ళి చీకటి పడ్డాక యింటికి వస్తుంటాడు.

పట్టాభి తల్లి "ఏమిటి సంగతి?" అని అడిగింది.

"అమ్మా! జెండా వీధిలో మన యిల్లు ఖాళీ అవుతుంద టగా? అది నాకు కావాలి!"

"జెండా వీధిలో ఏ యిల్లు?"

"జెండా యిల్లే!"

"జెండా యిల్లంటే ఏదయ్యా? కింద రెండు వాటా లున్నాయి, పైన రెండు వాటాలున్నాయి, పక్కన సందులోంచి వెళితే, వెనక ఒక యిల్లుంది. ఖాళీ అయ్యేది ఏ యిల్లు?"

"వెనకిల్లేనమ్మా! ఫలానా ముసలాయన చచ్చిపోయిన ఇల్లు!"

"ఏమిటీ! ఆ ముసలాయన చచ్చిపోయాడా? ... హాఁ! ఎక్కడో ఒకచోట చావాల్సిందే కదా? ... ఇప్పుడా యింటికి నువ్వొస్తావా?...వెళ్ళి సారథి నడుగు. ఈ విషయాలన్నీ వాడే చూసు కుంటాడు."

"సారథి ఎవరు?"

"మన గుమాస్తా. మండీలో వుంటాడు పో!"

మండీకి పరుగుతీశాడు రుద్రమూర్తి.

"చెయ్యి దాటిపోయింది సార్! మరో మనిషికి మాటివ్వడం జరిగిపోయింది. ఒక నెల అద్దె ఏభై రూపాయలు అడ్వాన్సు కూడా యిచ్చేశాడతను." అన్నాడు సారథి.

"అలా అంటే ఎలా సారథీ? నేను పట్టాభి స్నేహితుణ్ణి కదా?" అన్నాడు రుద్రమూర్తి.

"స్నేహితులైతే నన్నేం చెయ్యమంటారు? ఆయన్నే అడ గండి!" అన్నాడు సారథి.

ఆ సాయంకాలం కాంచన ద్వీపం నుంచి తిరిగి వచ్చిన పట్టాభిని రైల్వే ప్లాట్‌ఫారంలోనే కలుసుకుని, మహజరు సమర్పించు కున్నాడు రుద్రమూర్తి.

పట్టాభి ముఖం ఎప్పుడూ ప్రసన్నంగా వుంటుందని అంటారు అందరూ. ఆ మాట నిజంకాదు. పట్టాభి ప్రసన్నతను అభినయిస్తాడు. "అలాగేలే రుద్రా! ఇల్లే కదా? ఆ వ్యవహార మంతా అమ్మకే వొదిలేశాను. అమ్మను ఒకమాట అడిగి, సారథితో చెబుతాలే!" అన్నాడు ప్రసన్నంగా.

అమ్మ సారథి మీదికి, సారథి పట్టాభి మీదికీ, పట్టాభి అమ్మ మీదికీ నెట్టేస్తూ, వారం రోజుల పాటు రుద్రమూర్తిని ముప్ప తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాపించి, అతడి చేతికి తాళం చెవి యిచ్చారు, బంగారపు కడ్డీ యిచ్చినట్లు.

రుద్రమూర్తి సంతోషంతో పొంగిపోయాడు. కృతజ్ఞతా భావంతో కృంగిపోయాడు. పట్టాభి కాలితో చెయ్యమన్న ఏపనైనా సరే, చేతితో చెయ్యాలని మనస్సులోనే ఒట్టు పెట్టుకున్నాడు. ఆ మేరకు, ఆ తరువాతి రోజుల్లో ఒకసారి ఊళ్ళో మంత్రిగారి సభ జరిగితే, మంత్రిగారిని పొగుడుతూ పట్టాభికి ఒక ఉపన్యాసం వ్రాసి యిచ్చాడు. వేదిక మీద పట్టాభి ఆ ఉపన్యాసం చదివి అందరిచేతా సెహబాస్ అనిపించుకున్నాడు. మరోసారి ఒక సభలో రుద్రమూర్తి స్వయంగా ప్రసంగిస్తూ, పట్టాభిని పావుగంటసేపు ప్రస్తుతించి, అప్రస్తుత ప్రసంగం చేశాడన్న అపకీర్తి తెచ్చుకున్నాడు.

తాళంచెవి పుచ్చుకున్న రుద్రమూర్తి తొందర్లోనే ఓ మంచి రోజు చూసుకుని, పుస్తె కట్టించుకున్న దిక్కుమాలినదాన్ని వెంట బెట్టుకుని వేకువజామున ఐదు గంటలకు కొత్త బోనులో కాలు మోపాడు. పాలకడలిపై శేషతల్పాన శయనించి పెళ్ళాంచేత కాళ్ళు పట్టించుకుంటున్న విష్ణుమూర్తి పటాన్ని కూడా వెంట తెచ్చు కున్నాడు. పొయ్యిఅంటించి పాలుపొంగించాడు. పటానికి నైవేద్యం పెట్టి పటపటమని చెంపలు వాయించుకున్నాడు. ఆ సాయంకాలమే తన నలుగురు పిల్లల్నీ, నాలుగు మట్టి పెంకుల్నీ ఆ యింటి నుంచి ఈ యింటికి చేరవేశాడు. తన శేషజీవితం ఇక నిశ్చింతగా గడిచి పోతుంది లెమ్మనుకున్నాడు.

అప్పటికి జీవితంలో పూర్తిగా అలసిపోయి, మిథ్యావాదాన్ని ఆశ్రయించి, తద్వారా ఉపశమనాన్ని పొందే స్థితికి చేరుకున్నాడు రుద్రమూర్తి. నిద్రాహార మైథునాలే కాక, లోగడ మరొక కోరిక కూడా వుండేదతనికి, తన శవం వల్లకాటికి వెళ్ళేటప్పుడు తన స్వంత యింట్లో నుంచే బయలుదేరాలని! ఆ కోరిక ఈ జన్మలో ఈడేరదని తెలుసుకోటానికి చాలా కాలం పట్టింది. వేనకు వేలు కుమ్మరించి తాను ఇల్లో, ఇంటి జాగానో కొనుక్కోలేడు. చస్తే, పీనుగును కదల్చటానికైనా శక్తిలేని తన నెత్తిన కులం శనిదేవతలా కూర్చున్నది. ఇళ్ళు లేనివారికి ఇళ్ళ స్థలాలు పంచిపెట్టిన చేయి, 'నీది తక్కువ కులం కాదే, నీ కిలాంటి తక్కువ బుద్ధులు తగునా? పో అవతలికి!' అంటూ రుద్రమూర్తి నెత్తిన మొట్టింది. ఇళ్ళ



3

స్థలాల వేటలో విఫలుడైన రుద్రమూర్తి 'ఒరే! శక్తికి మించిన ఆలోచనలు పెట్టుకోవటం తప్పుకదూ? నివేశన స్థలం దొరికితే మాత్రం ఏం చేసుకుంటావ్ చెప్పు? గొయ్యితీసి పైన మట్టి పోసుకుంటావా? ఇల్లు కట్టుకునే సత్తా నీకుందా? ఇల్లంటే అగ్గిపెట్టె అనుకున్నావా? ఇటుకలంటే, పారేసిన పేకముక్కలనుకున్నావా? కలప అంటే, వూడిపోయిన పలక చెక్కలనుకున్నావా? సిమెంటంటే, పొయ్యిలో బూడిదనుకున్నావా? కూలీలచేత పని చేయించుకోవటమంటే, మంత్ర తంత్రా లనుకున్నావా? పిచ్చి నాగన్నా! ఇల్లూ ఇల్లూ అని కలవరించటం మానేసి, ఇంట్లో బియ్యం వున్నాయో, నిండుకున్నాయో చూడు!' అంటూ తనని తాను ఊరడించుకున్నాడు.

ప్రవాహంలో నువ్వొక పూచిక పుల్లవి. నీ శక్తి అత్యల్పం. ఎదురీదకు! ఏవైపు కొట్టుకుపోతున్నాం, ఎక్కడికి చేరుతాం అన్న జిజ్ఞాసేవద్దు. కాలం ఊబిలో చిక్కుకున్నావు. అది క్రమక్రమంగా నిన్ను బాధిస్తూనే నిన్నూ, నీ బాధల్నీ కూడా మింగేస్తుంది. అదే నీకు విముక్తి! కలిమీ, లేమీ అన్నవి పరస్పర విరుద్ధ స్థితులే అయినా, రెండూ మిథ్యే! అంటే కలిమీ లేమీ రెండూ ఒకటే!... ఈ తత్వానికి తలవంచేశాడు రుద్రమూర్తి.

మూడు రోజుల రైలు ప్రయాణానికి టిక్కెట్టు కొనుక్కున్నావు. బోగీలో తొక్కిసలాట. కూర్చోటానికి చోటులేదు. బొటనవేళ్ళమీద ఊనుకుని, ఒంటి కాలిమీద నుంచునీ రెండు రోజులు ప్రయాణం చేశావు. మూడో రోజున పూర్తిగా ఒక బెర్తు దొరికింది. ఎక్కి పడుకున్నావు. అప్పుడు నీకెలా వుంటుంది? మరో మూడు మైళ్ళ దూరంలో ప్రమాదం జరుగుతుందేమోనన్న ఆలోచన వచ్చినా, రైలు భూలోకం విడిచిపెట్టి గ్రహాంతరయానం చేస్తున్నదన్న భ్రమ కలిగినా, నువ్వు చలించవు. విశ్రాంతినే కోరుకుంటావు. నిద్ర చెదిరిపోకూడదనుకుంటావు. దొరికిన బెర్తే బ్రహ్మానంద సింహాసన మనుకుంటావు. జీవితంలో ఎన్నో మజిలీలు దాటినతర్వాత, రుద్రమూర్తి చేజిక్కించుకున్న నమ్మకమైన బెర్తు జెండా వీధిలోని యిల్లు.

అయితే, ఆ యిల్లు తన పాలిటి రుద్రభూమి అవుతుందని మొదట అనుకోలేదు రుద్రమూర్తి.

కాపురం చేరిన మొదటి మూడు నెలల్లో ఇంటిల్లిపాదీ వరసగా రెండేసిసార్లు మలేరియాకు లోనయ్యారు. ఆ వూళ్ళో చెయ్యివాసి బాగున్న డాక్టరుగారు 'అంతా దేవుడి చలవ!' అంటూ మనసులోనే దండం పెట్టుకున్నాడు. ఆ తరవాత, వాళ్ళందరి శరీరాలూ, రక్తమూ, శ్వాసావయవాలూ, పంచేంద్రియాలూ ఆ యింటి వాతావరణానికి అలవాటు పడిపోయాయి.

ఇక్కడ, జెండా బిల్డింగు బ్లూప్రింటు ఎత్తిచూపటం అవసరం. పశ్చిమాభిముఖంగావున్న ఆ భవనానికి ఇరువైపులా వలయాకారపు మెట్లచివర రెండు సిమెంటు జెండాలు కదలకుండా మెదలకుండా నిలబడి వుంటాయి, నంది విగ్రహం నెత్తిన కొమ్ముల్లా! నెలకు ఎనభయ్యేసి రూపాయలు చెల్లిస్తూ కింద రెండు కుటుంబాలూ, పైన రెండు కుటుంబాలూ అద్దెకుంటున్నాయి. పక్కన సందులోంచి వెడితే, వెనకవైపున రుద్రమూర్తి యిల్లు వుంటుంది. రుద్రమూర్తి యింటి వాకిట్లో నిలబడిచూస్తే సిమెంటు జెండాలు కనిపించవు. గుమ్మానికి మూరెడు దూరంలో ఎట్ట ఎదుట, కిందివాటాల పెరటి తలుపులు రెండూ బార్లా తెరుచుకుని వుంటాయి, ప్రసవ వేదనాభారంలో సిగ్గెగ్గులపైన ధ్యాసకోల్పోయిన తొలిచూలాలిలా! రెండు పెరళ్ళలోని మురుగు దొడ్లూ, అభిషేకానికిముందు అలంకారాలన్నీ ఒలిచి పెట్టేసిన దేవుడి విగ్రహాల్లా నగ్నంగా కనిపిస్తుంటాయి. పై వాటాలనుంచి మురుగు నీళ్ళు కిందికి పోవటంకోసం, రుద్రమూర్తి యింటి గుమ్మంలోనే రెండు సిమెంటు పైపులున్నాయి, కిందికి జారి వేళ్ళు తన్నుకున్న మర్రి ఊడల్లా! ఆ నాలుగిళ్ళ మలమూత్రాలూ, మురుగునీళ్ళూ రుద్రమూర్తి యింటి అడుగున మూతపెట్టిన రెండు కాలవల గుండా కదిలివెళ్ళి అవతల పడిపోతుంటాయి. రుద్రమూర్తి యింటి పెరటి తలుపు తెరిస్తే, తూరుపు దిక్కు దర్శనమిస్తుంది. అయితే, అందంగా వుండవలసిన తూరుపు పరమరోతగా వుంటుంది. పెద్ద మురుగు కాలవ. కాలవగట్టున మిరపతోట. దిగువ ఎక్కడో మళ్ళించిన మురుగు నీళ్ళతో మిరపతోట పండుతూ వుంటుంది. కాలవ పొడుగునా చాలాభాగం యిసుక మేటలే! రుద్రమూర్తి యింటి దగ్గిర మాత్రం, మోకాటిలోతు బురదలో పందులు పొర్లాడుతుంటాయి. కంటితో చూడనలవికాని పదార్థాలన్నీ రుద్రమూర్తి పెరటి గోడ కింది తూముల్లోనుంచి కాలవలోకి దూకుతుంటాయి.

ముందువైపుగానీ, వెనకవైపు గానీ తలుపు తెరవాలంటే భయం. ముక్కులు బద్దలయ్యేంత కంపు ఆగి ఆగి ఉప్పెనలా వచ్చి పడి ముఖంమీద మొత్తేస్తూ వుంటుంది. శ్వాస ఆగిపోతే ప్రాణం పోతుంది. రుద్రమూర్తి యింట్లో శ్వాసించటమన్నదే పెద్దచావు. వచ్చిన కొత్తలో అతను మేలురకం అగరువత్తులు కొనుక్కొచ్చి వెలిగించాడు. నెలరోజుల తరవాత, ప్రయోజనం లేదని తెలుసుకుని ఆ పని మానేశాడు.

రుద్రమూర్తికి గాలీ, వెలుతురూ, చెట్టుచేమా, ఎండా, వానా, వెన్నెల, చుక్కలు, వేకువ, సంధ్య మొదలైన ప్రకృతి సొగసులంటే చాలా యిష్టం. వాటికోసం అతను ఉదయమో లేదా సాయంకాలమో మాత్రమే డాబామీదికి వెళ్ళవలసి వుంటుంది. డాబామీదనుంచుని తూర్పుదిశగా చూస్తే మురుగునీళ్ళతో పెంచే మిరపతోట, దాని పక్కన సున్నపు బట్టీలు, గోతులూ కనిపిస్తాయి. కింద కాలువలో మురుగు ఉకలుక లాడుతూ వుంటుంది. ఎప్పుడూ ఎవరో ఒకరు—ఆడ, లేక మగ—బట్ట పైకి మడిచి పట్టుకుని వెనక్కి తిరిగి కూర్చుని వుంటారు. సాయంకాలాల్లో అయితే, ఆకాశం ఎర్రబడగానే, దోమలు ఇనప మేకుల్లావచ్చి పైన బడతాయి. నాలుగైదు నిమిషాలు డాబామీద నిలబడ్డ తర్వాత, రుద్రమూర్తి తప్పనిసరిగా కిందికి దిగి వెళ్ళిపోవలసిందే!

పట్టపగలే ఇంట్లోనూ, మరుగుదొడ్డిలోనూ దోమలు స్వైరవిహారం చేస్తుంటాయి. పొద్దుపోతే యిక వాటి పరాకమానికి ఎదురులేదు. ఇంటినిండా దోమలే! మొదట వాటికి కాకులు అని పేరు పెట్టాడు రుద్రమూర్తి. పిదప గద్దలన్నాడు. ఆ పేరు కూడా సరిపోదనుకున్నాక, రాబందులన్నాడు. అంతటితో తృప్తిపడక, గండభేరుండ పక్షులన్నాడు.

గండభేరుండ పక్షులనుంచి ఆత్మరక్షణ చేసుకోవటం ఎలా? మస్కిటో ఫాయిల్స్ కొనటం మొదలుపెట్టాడు. అందుకోసం నెలకు పదిరూపాయల ఖర్చు. ప్రారంభంలో గండభేరుండాల గుంపు తగ్గినట్లే అనిపించింది. అయితే అవి క్రమంగా ఆ మందు పొగను కూడా లొంగదీసుకునేశాయి.

దోమతెరలు కొనుక్కోవాలన్న జ్ఞానంలేని మూర్ఖుడు కాడు రుద్రమూర్తి. అప్పుగా లభించేట్లయితే అండపిండ బ్రహ్మాండాన్నయినా కొనేయగలడు. అయితే తనకు అప్పుదొరికే కొట్లో మస్కిటో ఫాయిల్స్ వున్నాయిగానీ, దోమతెరలు లేవు. డబ్బుపెట్టి కొనుక్కోవాలంటే, దోమతెరలు కొనగలిగినంత డబ్బు అతడి దగ్గిర ఎప్పుడూ వుండదు.

రాత్రి తెల్లవార్లూ రుద్రమూర్తి యింటి బయట నిలబడే ఓపిక ఎవరికైనా వుంటే, లోపల ఛెళ్ళు ఛెళ్ళున ఒళ్ళు చరుచుకుంటున్న చప్పుళ్ళు వినగలరు వాళ్ళు. రుద్రమూర్తి పెళ్ళాం పిల్లలు దీపాలు ఆర్పేసి పడుకున్నాక, గంటసేపు దోమల్ని చరుచుకుంటూ, అలసి నిద్రపోతారు. మూడు జాములు పూర్తయ్యాక కానీ, రుద్రమూర్తికి నిద్రపట్టదు. అటూ యిటూ పొర్లుతూనే వుంటాడు. ఒళ్ళంతా బాదుకుంటూ వుంటాడు. నడివీపున చరుచుకోవడం కూడా, అభ్యాసంవల్ల సులువైన పనైపోయిందతనికి. ఒక్కొక్క చరుపుకు గొంగళి పురుగంత దోమ చితికి, వేలికంటుకుంటుంది. పెళ్ళాం పిల్లలపైన సానుభూతి చంపుకోలేక, అప్పుడప్పుడూ లేచి లైటు వేస్తాడతను. కాకుల గుంపుల్లా పైకి లేస్తాయి దోమలు. అందరివైపూ ఒకసారి చూస్తాడు. ఉక్కకు రవిక విప్పేసుకుని చెమటలో దొప్ప దోగుతున్న తన పెళ్ళాం రొమ్ముమీద ఒక్కచరుపు చరిచి, ఒక మశకాసురుణ్ణి హతమారుస్తాడు. గులాబీ మొగ్గలాంటి తన కూతురి చెక్కిలిమీద ఒక చరుపు చరుస్తాడు. చెడ్డీ విప్పేసి బోరగిల పడుకున్న తన చిన్న కొడుకు పిర్రమీద ఒక్క చరుపు చరుస్తాడు. లేచి నిలబడి, కర్రసాము చేసేవాడిలా గిరగిరా తువ్వాలు తిప్పుతూ చెంగనాలు వేస్తాడు.

దోమలకు తోడు, పడకచుట్టూ బొద్దింకలూ, మురుగు కాలవలోంచి పాకి వచ్చిన కప్పలూ!

కిందివాటాల పెరళ్ళు రెండూ గుమ్మానికి ఎదురుగా వుండటంతో, దొడ్డికి కూచున్న వాడి ముడ్డిదగ్గిర ముఖంపెట్టి పడుకున్నప్పటి అనుభూతి నిత్యనూతనమైపోయింది రుద్రమూర్తి కాపురంలో. రాత్రింబవళ్ళూ ఏకధాటీగా, ముక్కూ చెవులూ కళ్ళూ భరించలేనంత వాసనా, ధ్వనీ, రోతా! పాచిపట్టిన పెరటినేల ఆరటానికి ఆరటంకోసం ఆ తలుపులు పగలల్లా తెరిచే వుంటాయి. లోపలి తలుపులు మూసివుంటాయి. అవసరమైనప్పుడల్లా లోపలి తలుపులు తెరుచుకోవడం, పెరటి తలుపులు మూసుకోవటం, మరుగుదొడ్ల తలుపులు తెరచి మూసుకోవటం; అవసరం తీరాక మూసిన తలుపులు తెరచుకోవటం, తెరచిన తలుపులు మూసుకోవటం జరుగుతుంటాయి. అవసరంలేని సమయమేలేదు. అనుక్షణం ఈ పని జరుగుతూనే వుంటుంది. ఆ గోడకూ ఈ గోడకూ మధ్య మూరెడు ఎడం మాత్రమే వుండటంవల్ల, ఆ శబ్దాలన్నీ చెవుల్లో మార్మోగుతుంటాయి. ఉదయంపూట తలుపులు సంగీత సాధన చెయ్యటం, అంట గిన్నెలు ఖంగు ఖంగు మనటం, ముఖం కడుక్కుంటూ తుర్రున ముక్కు చీదటం, క్యాక్కుమని ఖాండ్రించటం లాంటివి గూబల్ని అదరగొట్టేస్తాయి. రాత్రిళ్ళు పెరటి తలుపులు మూసుకుంటాయిగానీ, అవి శబ్దాలను మాత్రం అడ్డుకోలేవు. శబ్దం శ్రావ్యంగా వుంటుంది, అది లయబద్ధమైనప్పుడు! శబ్దం నిరపాయకరంగానే వుంటుంది, దాన్ని వినటానికి మనం సిద్ధంగా వున్నప్పుడు! కింది వాటాలనుంచి వచ్చే శబ్దాలు లయబద్ధమైనవీ కావు, అవి చెప్పి వచ్చేవీ కావు.

నడిరేయిదాకా అప్పుడప్పుడూ కిందివాటాల పెరళ్ళ లోపలి తలుపులు ఢభాల్‌మంటూ తెరుచుకుంటాయి. మరుగు దొడ్లకున్నవి రేకు తలుపులు. అవి ఢర్‌మంటాయి. కొంత విరామం. ఆ విరామంలో కూనిరాగం. కాకపోతే ఈలపాట. తరవాత థపథపమంటూ ముడ్డి కడుక్కుంటున్న చప్పుడు. బుడుక్కు డుబుక్కుమంటూ రెండు బక్కెట్ల నీళ్ళ బిలంలోకి దూకేస్తాయి. మళ్ళీ మరుగుదొడ్డి తలుపు ఢర్‌మంటే, లోపలి తలుపు ఢభాల్‌మని వంత పాడుతుంది. చెవిలోనే మరుగుదొడ్లూ పెరళ్ళూ వున్నాయా అనిపించే ఈ శబ్దాలు వినటానికి సిద్ధంగాలేని రుద్రమూర్తి ఉలికులికీ పడుతుంటాడు. అతని గుండె దడదడలాడిపోతుంది. సిమెంటు జెండాల వెనక్కి వచ్చాక, అతనికి గుండెదడ అనే జబ్బు కూడా ప్రారంభమైంది. రోజుకి రెండు మూడు కాంపోజ్ మాత్రలు మింగటం అలవాటైంది. తనమీద తనకెంత జాలివుందో, ఎదుటి వాటాల వాళ్ళమీద కూడా అంతే జాలి వుంది అతనికి. పాపం, వాళ్ళు చేసిన నేరం ఏముంది? పెరడూ, దొడ్డీ మానవుడికి నిత్యావసరాలూ, అత్యావసరాలూ కదా?

ముక్కు మూసుకుంటూ, చెవులు మూసుకుంటూ, గుండె నిమురుకుంటూ, ఒళ్ళు చరుచుకుంటూ, ఉస్సురని నిట్టూరుస్తూ, ఆ యింట్లో రెండేళ్ళు గడిపేశాడు రుద్రమూర్తి. మనిషికి ముక్కున్నది ఎందుకు? మురుగు వాసన పీల్చి బతకటానికేనా? చెవులున్నాయి ఎందుకూ? కర్ణకఠోరమైన శబ్దాలు వినటానికేనా? కళ్ళున్నవి ఎందుకు? ముట్టురాలైన పుడమితల్లి మాలిన్య మర్మాన్ని తిలకించటానికేనా? చేతులున్నవి ఎందుకు? రాత్రంతా నిద్ర మేలుకుని ఒళ్ళు చరుచుకోటానికేనా? ఈ శరీరం ఎందుకు? అసహజమూ, అమానుషమూ అయిన చిత్రవిచిత్ర హింసల్ని అనుభవించటానికేనా? ఏమిటీ ఈ యిల్లు? ఇది యిల్లా, నరకమా? భూమికీ ఈ యింటికీ సంబంధంలేదు. భూమిని అంటిపెట్టుకుని తిరుగుతున్న గ్రహశకలం యిది. రెండూ ఒక్క

టిగా కలిసి తిరుగుతున్నా, దేని వాతావరణం దానిదే! ఇల్లు సౌకర్యంగా వుందని చెప్పిన ఆ ముసలిదీ, దాని మొగుడూ ఈ యింట్లో అన్నేళ్ళు ఎలా వుండగలిగారు? ముదివగ్గులైన వాళ్ళ సర్వేంద్రియాలూ బహుశా చచ్చుబడిపోయి వుంటాయేమో!

''అబ్బా! ఈ యింట్లో యింకోక్షణం కూడా బతకలేనురా దేవుడా!'' అంటూ అనుక్షణం ఆక్రందించాడే కానీ, మరో యిల్లు వెతికే ప్రయత్నం చెయ్యలేదు రుద్రమూర్తి. గుంజకు కట్టేసిన గొడ్డులా అక్కడే వుండిపోవటానికి కారణం లేకపోలేదు. రుద్రమూర్తికి వచ్చే జీతం, తిని తేపటానికే చాలదు. కాలికి బలపం కట్టుకుని భూప్రదక్షిణం చేసినా, వెంటనే మరో యిల్లు దొరకదు. దొరికినా, యిలాంటిదే మరో నరకం దొరుకుతుంది కానీ, యింతకంటే మెరుగైన యిల్లు దొరకదు. మెరుగైన యిల్లు దొరికినా, ఏ వంద రూపాయలో అద్దె యిచ్చే స్తోమతు తనకులేదు. పిల్లలు చదువుకుంటున్నారు. వాళ్ళ చదువులకు అయ్యే ఖర్చులన్నిటినీ మానేస్తే, అంతలేసి అద్దెలు యిచ్చేయవచ్చు. ఆ యిల్లు వదలకపోవటానికి మరో ప్రబల కారణం వుంది. పట్టాభిగానీ, అతని తల్లిగానీ, గుమాస్తాగానీ ఏనాడూ యింటికొచ్చి అద్దె అడిగిన పాపాన పోలేదు. తాను వెళ్ళి యివ్వటమేతప్ప, వాళ్ళు రారు. నెలనెలా వరసగా యివ్వలేక, నాలుగు నెలల అద్దెడబ్బులు ఒక్కసారిగా తీసుకుపోయి యిచ్చిన సందర్భాలూ వున్నాయి. అద్దె యింట్లో కాపురం వుంటున్నవాడికి అంతమంచి సౌకర్యం వున్నప్పుడు, అది నరకం అయితే మాత్రమేం?

రుద్రమూర్తిని నిస్పృహాయుణ్ణి చేసింది అతని దుస్థితి. అస్తవ్యస్తమైన ఆలోచనలూ, స్వగతాలూ, ఆధ్యాత్మిక ఊహా వీచికలూ అతనికి నెచ్చెలులైనాయి. జీవన్మరణాలలోని వివిధ రసానుభూతులకూ సృష్టి స్థితిలయ విన్యాసాలకూ ప్రతీకలై మానవుడి నీడలో అమరత్వాన్ని సాధించిన దేవుళ్ళతో మాట్లాడటానికి వీలుపడే ఊహాలోకపు తలుపులన్నీ అతనికోసం తెరుచుకున్నాయి.

ఓ రోజు నడిరేయిదాకా మస్కిటో ఫాయిల్ పొగతో ఊపిరితిత్తుల్ని నింపుకుని, రెక్కలు పడిపోయేదాకా ఒళ్ళు చరుచుకుని, విష్ణుదేవుడి పటంముందు నిలబడి జాలిగా అడిగాడు రుద్రమూర్తి. ''స్వామీ! ఈ దోమలు నిన్నేమీ చెయ్యటంలేదూ?''

విష్ణుదేవుడు మాట్లాడలేదు కానీ, పటంచుట్టూ ప్రదక్షిణం చేస్తున్న ఓ దోమ యిలా గీ పెట్టింది: ''పటానికి అద్దం బిగించుకుని పడుకున్నాడు గనక సరిపోయింది. లేకపోతే నా తడాఖా చూపించనూ?''

కొన్నాళ్ళ తర్వాత పందికొక్కు పటాన్ని దొర్లించేసింది. అద్దం కాస్తా ముక్కలైపోయింది. రుద్రమూర్తి మళ్ళీ అద్దం వేయించలేదు.

అతను మళ్ళీ యిలా అన్నాడు దేవుడితో: ''స్వామీ! పాపం, నిన్ను దోమలు పొడిచి చంపేస్తున్నాయేమో! ఈ కంపుతో నీకుక్కు దిబ్బళ్ళు పడిపోతున్నదేమో! ఏం చెయ్యను? మళ్ళీ అద్దం వేయించాలని వుంది. కానీ, చేతిలో చిల్లిగవ్వయినా నిలవటంలేదు.''

దేవుడు హేళనగా నవ్వి అన్నాడు, ''పిచ్చివాడా! నీ కంటికి నేను వేరుగా, దోమలూ దుర్వాసనా వేరుగ కనిపిస్తున్నామా? నేనే దోమని, దోమే నేను! నేనే దుర్వాసనని, దుర్వాసనే నేను! నవ్వేవాడూ ఏడ్చేవాడూ, బాధపడేవాడూ-బాధపెట్టేవాడూ, మేడకట్టేవాడూ-మేడలో కాపురం పెట్టేవాడూ, అన్నమో రామచంద్రా అని ఆక్రోశించేవాడూ—లేదు పొమ్మని కసురుకునేవాడూ, మేడ ముందరున్న సిమెంటు జెండా – మేడ వెనకవున్న మురుగు కాలవా అన్నీ నేనే! నీదనుకుంటున్న ఆ శరీరమూ నేనే, ఆ శరీరంపైన వాలిన దోమా నేనే! ఈ సృష్టిలోని ప్రతి అణువూ నేనే!...దోమేమిటీ, దుర్వాసనేమిటీ!''

రుద్రమూర్తి ఒక సరళరేఖ గీచాడు. ఒక చివర మురుగు కాలవ చన్నుకుడుపుతూ మురుగుదొడ్లు ముద్దులాడుతున్న ఈ అద్దె యిల్లు, మరోచివర ఐదారు లక్షల రూపాయల ప్రభుత్వ సహాయంతో అత్యాధునికంగా నిర్మించిన సినిమా థియేటరు! ఈ రెండూ ఒకే భూతలం పైన వున్నాయి! ఈ రెంటికీ మధ్య, యిదే భూతలంపైన యింకా ఏమున్నాయి ?

లక్ష్మీనగర్. లక్ష్మీనగర్‌లో పట్టాభి యిల్లు. అందులో ఎన్నో గదులు. పైన మరో అంతస్తు. ఇంటి చుట్టూ ఎన్నో కిటికీలూ, వెంటిలేటర్లూ. ప్రతిగదిలోనూ సోఫాలూ, మంచాలూ, టేబిల్సూ, సీలింగ్ ఫ్యాన్లూ, కర్టెన్లూ వగైరా!...రుద్రమూర్తికి అక్కడ స్థానంలేదు.

సరళరేఖమీద మరో బిందువు—ఒక్కొక్క యింటికి మూడువేల రూపాయల మతింపు చొప్పున, వెనకబడిన కులాల వాళ్ళకోసం మంత్రిగారు కట్టించిన కాలనీ!... రుద్రమూర్తికి అక్కడా స్థానం లేదు.

సరళరేఖమీద మరోచోటు—సత్యమ్మ గుడిపక్కన రావిమాను కింద రచ్చబండ. సత్యమ్మ అన్నది గ్రామదేవత పేరు. ఆమె పసుపూ కుంకుమా పులుముకుని, మూరెడెత్తు రాయిగా అక్కడ వెలసింది, గ్రామ పంచాయతీ సర్పంచ్‌ను ఉద్ధరించటంకోసం! పట్టాభికీ, సర్పంచ్‌కూ స్థితిగతుల్లో చాలా పోలికలున్నాయి. సర్పంచ్ వృద్ధుడూ, శారీరకంగాబలహీనుడూ! ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌నీ, శానిటరీ ఇన్స్పెక్టర్‌నీ, పాకీవాళ్ళ బృందాన్నీ అతను ఎక్కడ దాచి పోషిస్తున్నాడో ఎవరికీ తెలియదు. డి. డి. టీ పౌడరూ, ఫినాయిలూ, వాటితాలూకు సాధన సంపత్తీ ఒకటి రెండు వీధుల్ని మాత్రమే సేవించి తరిస్తుంటాయి. సర్పంచ్‌కు దైవభక్తి అపారం. అతను ఉదయమూ సాయంకాలమూ క్రమం తప్పకుండా సత్యమ్మచుట్టూ చేతులు జోడించి ప్రదక్షిణాలు చేస్తుంటాడు.

పక్కన రచ్చబండపైన రావిచెట్టు నీడను ఒక ముష్టివాడు ఆక్రమించుకున్నాడు, దేవేంద్ర సింహాసనం దొరికినంత సంబరంతో. వాడు అద్దె చెల్లించనవసరం లేదు. మంచి గాలి. పరిసరాలలో ఎక్కడా దుర్గంధంలేదు. దోమల బెడదలేదు. కందమూలాలు తిని కొండ నీళ్ళు తాగి బతికే తాపసిలా ఆరోగ్యంగా వున్నాడు. వాణ్ణి చూస్తే రుద్రమూర్తికి అసూయ. వాడు చావటంగానీ, వూరు

వదిలి వెళ్ళిపోవటంగానీ జరిగితే, ఆ స్థలాన్ని తాను ఆక్రమించాలన్న బలీయమైన కోరిక రుద్రమూర్తికి వుంది. అయితే తాను ఆ పని చెయ్యలేడు. తనకు సంసారంవుంది. తను అలాటి పనిచేస్తే, తనను వెక్కిరించటంతప్ప తన పరిస్థితిని సానుభూతితో అర్థం చేసుకోలేని సమాజం తన చుట్టూవుంది. రుద్రమూర్తికి అక్కడ కూడా స్థానంలేదు.

ప్రభుత్వ సహాయంతో ధనవంతుడు కట్టుకున్న సినిమా థియేటరూ, లక్ష్మీనగర్‌లో పట్టాభి యిల్లు, గ్రామదేవతచుట్టూ చేతులు జోడించి ప్రదక్షిణంచేసే సర్పంచ్‌గారు కొలువుదీరే పంచాయతీ ఆఫీసు, పథకాలూ ప్రణాళికలూ దయతలిచి తక్కువకులం వాడికి ప్రసాదించిన నీడపట్టు, ముష్టివాడు మకాం పెట్టిన రచ్చబండ, భూలోక వాతావరణానికి భిన్నంగా తాను వుంటున్న గ్రహశకలం-యివన్నీ దేవుడేనా? అయ్యోపాపం, దేవుడెంత కురూపి!

తన యింటి వెనకవున్న మురుగు కాలవకు వైతరణి అని పేరు పెట్టుకున్నాడు రుద్రమూర్తి. వీధిలో ఎప్పుడైనా చావు తప్పెట మోగినప్పుడు, ఊళ్ళో ఎవరైనా చచ్చారన్న వార్త విన్నప్పుడూ, పెరటివైపు తలుపు తెరిచి వైతరణికేసి చూసేవాడు. దున్నపోతు నెక్కి వైతరణిమీదుగా కదిలిపోతూ కనిపిస్తాడు యమధర్మరాజు. మొదటిసారి, కనుబొమ ఒకటి పైకెగరేసి ఓరగా చూస్తూ మీసం దువ్వుకుంటూ వెళ్ళాడు. రెండోసారి, వైతరణి మీద ఆగి, ఆ భుజంమీది గదను ఈ భుజానికి మార్చుకుని, చిరునవ్వుతో రుద్రమూర్తికేసి చూస్తూ, "ఏమోయ్! నువ్వూ వస్తావా?" అన్నాడు. "ఇప్పుడేనా? పిల్లలు ప్రయోజకులు కావాలి గదా!" అంటూ తలుపు మూసుకున్నాడు రుద్రమూర్తి!

మరోసారి, "యమధర్మరాజా! ఇప్పుడు నువు పట్టుకుపోతున్నవాడు స్వర్గానికి వెడతాడా, నరకానికి వెడతాడా?" అని అడిగాడు.

"నరకానికే!" అన్నాడు యముడు.

"నరకం ఎలా వుంటుంది స్వామీ?"

"మూర్ఖుడా! నరకంలోనే వుంటున్నావు, నరకాన్ని గురించి తెలియదంటావే!" అనేసి, దున్నపోతు డొక్కలో తన్ని ముందుకు సాగిపోయాడు యముడు.

రుద్రమూర్తికి క్రమేపీ బ్రతుకుమీద రోతపుట్టింది. చావు గురించీ, మరణానంతర జీవితం గురించీ అతనిలో ఆలోచనలు ఎక్కువ కాసాగినవి. వల్లకాడు అతన్ని ఆకర్షించింది. పరిచితులు ఎవరు చచ్చినా, అతను శవంవెంట వల్లకాటికి వెళ్ళేవాడు. వీలయినంతసేపు శవాన్ని చూసేవాడు. శవాన్ని పాతిపెట్టి అందరూ వెళ్ళిపోయిన తరవాత కూడా, చాలాసేపు అక్కడే ఏ చెట్టు నీడనో కూర్చుంటాడు. సమాధులకేసి, అక్కడక్కడా చెదురు మదురుగా పడివున్న పుర్రెలకేసి, ఎముకలకేసి తదేకంగా చూస్తూ వుండిపోతాడు. ఏ ఎముక ఎవరిదో ఎలా చెప్పగలం అనుకుంటూ నవ్వుకుంటాడు శవాన్ని తగల బెట్టాల్సివస్తే, చితికి నిప్పంటించిన తరవాత, వెట్టివాళ్ళ వెంట ఇతరు లెవ్వరూ అక్కడ వుండరు, ఒక్క రుద్రమూర్తి తప్ప! నింగిని తాకే మంటల్లో శవం కాలటం చూస్తాడతను. పుర్రె పెటిల్లున పేలటం చూస్తాడు వంకర్లు పోతున్న కట్టెను వెట్టివాళ్ళు కర్రలతో బాదటం చూస్తాడు. ఒంటరిగానే యింటికి తిరిగి వస్తాడు.

చావుపట్ల అతనికి భయం పోయింది. వల్లకాటిమీద గౌరవం పెరిగింది. వల్లకాడు! ఇది సిమెంటు జెండాలు నిలబడ్డ చోటు కాదు. శాంతి బావుటా రెపరెపలాడే సదానంద సీమ! శరీరానికీ, పంచభూతాలకూ సంబంధం లేదిక్కడ! శవాలు సుఖంగా నిద్రపోతాయి యిక్కడ! శరీరాన్ని మట్టి తినివేయటంగానీ, చింతనిప్పులు మాడ్చివెయ్యటంగానీ ఏమీ తెలియదు. అంతగాఢ నిద్ర! ఆకలికి అల్లాడేవాడూ, నొప్పికి ఏడ్చేవాడూ, రోగీ, భోగీ, కలవాడూ, లేనివాడూ, మాన్యుడూ, సామాన్యుడూ, ఇల్లులేని రుద్రమూర్తీ, ఇళ్ళూ పొలాలూవున్న గ్రామ సర్పంచ్, అందరూ సుఖాన్ని సమంగా పంచుకుని సహజీవనం చేసే సమతారాజ్యం యిది! ఇక్కడ దరిద్రుడు మస్కిటో ఫాయిల్స్ వెలిగించుకోనవసరంలేదు. ముక్కూ చెవులూ మూసుకోనవసరంలేదు. ఉలికిపడటమంటూ వుండదు. కాంపోజ్ మాత్రలతో పనిలేదు. మృతి జీవితంలోనే వున్నది. ఇక్కడ వున్నది మృతి కాదు; అమృత కవచం!

వయస్సుతోబాటు బరువు బాధ్యతలు పెరగటంవల్లా, ఓపిక చచ్చిపోవటంవల్లా, సాయంకాలాల్లో వాహ్యాళి వెళ్ళే అలవాటు తప్పిపోయింది రుద్రమూర్తికి. అయినా, అరుదుగా ఎప్పుడైనా ఊరి బయట కొండమీదికి వెళ్ళి కూర్చుంటాడు· సంధ్యారాగంలో ప్రకృతి సౌందర్యాన్ని చూచి అతని హృదయం పులకించిపోతుంది. సంఘజీవనానికి దూరంగా, ఎంత ప్రశాంతి! ఇక్కడే స్థిరనివాసం ఏర్పరచుకో గలిగితే ఎంత బాగుణ్ణు! అయితే అది సాధ్యం కాదుగదా? తనవెంట మరో అయిదుగురు. వాళ్ళ అవసరాలు యిక్కడ తీరవు. జన జీవనానికి అవసరమైనవేవీ ఈ కొండమీదలేవు, ఒక్క బ్రహ్మానందం తప్ప! మరేం ఫరవాలేదు· తాను చచ్చిన తర్వాత ఈ అపార సౌందర్యమంతా తనదే కదా? శరీరం వల్లకాట్లో నిద్రపోతుంది. ప్రాణం ఈ గాలిలో కలిసిపోయి విశ్వమంతటా వ్యాపించి పాంచభౌతిక జీవన సౌందర్యాన్ని అణువణువునా ముద్దిడుకుని మురిసిపోతుంది. వర్తమానం చేదుగా వుంటే వుండనీ, భవిష్యత్తులో ఎంత మాధుర్యం వుంది!

వేసవికాలం వచ్చింది. పరీక్షలు ముగిశాయి. పిల్లలకు సెలవులిచ్చారు. పదిరోజులపాటు సుఖంగా వుండి వద్దామని, రుద్రమూర్తి భార్య పిల్లల్ని వెంటబెట్టుకుని తన అన్నగారు వుంటున్న వూరికి వెళ్ళింది దోమలమధ్య, మురుగు వాసనలమధ్య, మరుగుదొడ్ల వికృత శబ్దాలమధ్య పలుకుతోడు లేకుండా ఒంటరిగా యమయాతన పడ్డాడు రుద్రమూర్తి.

ఒకనాటి ఉదయం, గ్రామ సర్పంచ్ పోయాడన్న వార్త తెలిసింది. ప్రాణం యింట్లోనే పోయిందట! అయినా, బంధుమిత్ర కుటుంబ పరివారమంతా వెంటనే శవాన్ని పట్నం ఆస్పత్రికి తీసుకు

పోయి, ప్రాణం పోయిందని పెద్ద డాక్టర్ల దగ్గిర రూఢి చేసుకుని, శవాన్ని యింటికి తీసుకొచ్చేశారు.

రుద్రమూర్తి పెరటి తలుపు తెరిచాడు. యమధర్మరాజు అవతలి ఒడ్డుకు వెళ్ళిపోతున్నాడు.

''యమధర్మరాజా!'' అన్నాడు రుద్రమూర్తి.

యముడు విసుగ్గా వెనక్కి తిరిగి చూశాడు.

''సర్పంచ్ గారినేనా పట్టుకుపోతున్నావు?''

''ఆ!''

''యమధర్మరాజా! నన్ను కూడా తీసుకుపోవూ?''

యముడు వికటాట్టహాసం చేశాడు. దున్నపోతు కూడా నవ్వింది. సర్పంచ్ నవ్విన చప్పుడు కూడా వినిపించింది.

''నిన్ను తీసుకుపోవటమేమిరా మందమతీ! నువ్వెప్పుడో చచ్చావుకదా? నువ్వు పీనుగువి! పీనుగులు వల్లకాటికి వెళ్ళాలిగానీ, మాతో రాకూడదు...'' అనేసి, నవ్వలేక నవ్వుతూ వెళ్ళిపోయాడు యమధర్మరాజు.

రుద్రమూర్తి తన శరీరాన్ని పరీక్షించుకున్నాడు. గుండె కొట్టుకుంటూనే వుంది. నాడి ఆడుతూనే వుంది. ఒళ్ళు వెచ్చగానే వుంది.

''మంచి విట్టే వేశాడు యమధర్మరాజా!''

మామూలుగానే ఆ సాయంకాలం శవం వెంట వెళ్ళాడు రుద్రమూర్తి. మైలు పొడుగునా జన సందోహం! తప్పెట్లు, మేళతాళాలు, చెక్కభజనలు, కోలాటాలు, బాణ సంచా, దారి పొడుగునా పాడెమీద చిల్లర డబ్బుల వాన! పీక నొక్కుతున్నా పడగ విప్పటం తెలియని తక్కువ కులాల వాళ్ళంతా తాగి తందనాలాడారు. మనిషీ మనిషీ ఒరుసుకుంటూ, కాలూ కాలూ తొక్కుకుంటూ సాగింది శవయాత్ర. వల్లకాటికే గదా వెళుతున్నాం, అనుకున్నాడు రుద్రమూర్తి. అయితే శవం వల్లకాటికి కాకుండా, మరో దారి వెంబడి ఊరి పొలిమేర చేరుకుంది. చుట్టూ కనుచూపు మేరవరకూ సర్పంచ్‌గారి పొలాలూ, తోటలూ! నలభై వేల రూపాయలు ఖర్చు పెడితేగానీ తవ్వించలేనంత బ్రహ్మాండమైన పంపుబావి గట్టున పొన్నచెట్టు పక్కన గోతిలో సర్పంచ్‌గారి శవాన్ని పాతిపెట్టారు. సంక్రాంతి ముగ్గులు తీర్చినట్లు జనంగుంపులు గుంపులుగా కూర్చుని, సర్పంచ్‌గారు టోకుగా గుత్తకు తీసుకున్న ఉత్తమ గుణాలన్నిటి గురించీ ముచ్చటించుకున్నారు. సర్పంచ్‌గారికి చలువ రాళ్ళతో సమాధి కడతారనీ, సమాధిపైన నగిషీలు మలిచిన మండపం కూడా కడతారనీ విన్నాడు రుద్రమూర్తి. సర్పంచ్ బతికినంతకాలమ్మూ పై మెట్టుమీదే బతికాడు. చచ్చిన తరవాత కూడా పై మెట్టు మీదే సమాధి అయిపోతున్నాడు. అతనికి వల్లకాడు అంటరానివాళ్ళ


# ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.
విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.

*తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకి ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.*

*ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు!*

★ మనసినిమాలు ★ డాక్టరు కబుర్లు ★ కలైడోస్కోపు కార్టూన్
★ దినవారఫలాలు ★ మా ఊరి సమస్య ★ శ్రీకృష్ణభాగవతం
★ ఇది నారీదృక్పథం ★ అరణ్యకాండ ★ వింత యదార్థం

★ ఇంకా — వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము!

*వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి!* మేనేజరు, ఆంధ్రపత్రిక

గూడె మన్నమాట! చచ్చిన తర్వాత కూడా అతనికొక ప్రత్యేకమైన ఉనికి! తన స్వంత ఎస్టేటులోనే తనకు సమాధి. అక్కడ మరెవ్వరినీ పాతిపెట్టటానికి వీల్లేదు. వల్లకాటి ప్రేతాలన్నీ వల్లకాట్లో వుండాల్సిందే. అవి యింత దూరానికి తొంగిచూడలేవు. 'ఒరే సర్పంచూ!' అని పిలిచి, తమకున్న సమాన హోదాను ప్రదర్శించు కోటానికి వాటికి అవకాశంలేదు.

రుద్రమూర్తి మౌనంగా నడుస్తూ, దారి పొడుగునా కనిపించిన మిద్దెల్నీ మేడల్నీ గుడిసెల్నీ పాకల్నీ పాడుగోడల్నీ చూస్తూ, ఆగుతూ, సాగుతూ, చీకటి పడుతుండగా యిల్లు చేరుకున్నాడు. తాళం తీసి తలుపు తెరిచిన అరనిమిషానికి, ''రుద్రయ్యా!''అంటూ లోపలికి తొంగిచూశాడు రహీం. అతడి భుజాన గునపం, చేతిలో బరువైన చిన్నసంచీ వున్నాయి.

పట్టాభి రుద్రమూర్తితో కలిసి స్కూల్ ఫైనల్‌దాకా చదువుకుని కాలేజీకి వెడితే, రహీం ఐదో తరగతివరకే చదువుకుని, బడి మానేసి, కులవృత్తి చేపట్టాడు. మైలుదూరంలో వాడికొంప. రాళ్ళు పగలగొట్టీ, పునాదిగోడలు కట్టీ పొట్ట పోసుకుంటున్నాడు. అతని ఒంటిమీద ఎప్పుడూ మురికిబట్టలే వుంటాయి. అవి కూడా చీలికలు పేలికలుగా చిరిగిపోయి వుంటాయి. పాతచొక్కా ఏదైనా కావలసి వచ్చినప్పుడూ, రూపాయో అర్ధో అవసరమైనప్పుడూ రుద్రమూర్తి దగ్గరికి వస్తూవుంటాడు రహీం.

డబ్బు అడుగుతాడేమో, లేదని చెబుదాం; చొక్కా అడుగుతాడేమో, వున్న రెండు చొక్కాల్లోనుంచి ఒకటి యిచ్చేద్దాం అని అనుకుంటూ, ''ఏం కావాలి?'' అన్నాడు రుద్రమూర్తి.

''ఏం లేదు రుద్రయ్యా! ఈ వీధి చివర పని చేస్తున్నాను. పునాది పనిలే! రేపటికి పూర్తవుతుంది. రేపు మళ్ళీ రావాలి కదా? ఈ గునపం, సంచీ యిక్కడ పెట్టిపోదామని...''అన్నాడు రహీం.

''ఊఁ!''

రహీం సంచీ, గునపం ఒక మూలపెట్టి వెళ్ళిపోతుంటే, ''ఒరే రహీం!'' అన్నాడు రుద్రమూర్తి. రహీం వెనక్కివచ్చాడు.

''రహీం! నీకు పునాదులు వెయ్యటం మాత్రమే తెలుసా? ఇంకేమీ చేతకాదా?''

''పెద్దలు నేర్పింది అదేకదా రుద్రయ్యా! అదితప్ప యింకేం తెలుసు?''

''వెధవా! అదికాదు! పునాదుల్ని పెకలించలేవూ?''

''ఎందుకు పెకలించాలి?'' అన్నాడు రహీం, చిత్రంగా.

''దున్నపోతూ! పెకలించాల్సిన అవసరం ఎంతో వుంది. పునాదులు వేసి వేసీ ఊరు పాడు చేశావు గదరా! పునాదులు పడగొట్టలేనివాడివి పునాదులు ఎందుకు వేశావు?''

పిచ్చివాగుడుగ అర్థం చేసుకుని బిత్తరపోయాడు రహీం. ఏదో ఒక సమాధానం చెప్పాలి గనక, ''పునాదులు వెయ్యాలని కూలీకి పిలుస్తారు గానీ, పడగొట్టమని ఎవరూ పిలవరు గదా రుద్రయ్యా!'' అన్నాడు.

''కూలి వెధవా! అందుకే యిలా పాతగుడ్డలూ పావలాలూ అడుక్కుంటున్నావు. నీ బుద్ధి మారదు, నీ బతుకూ మారదు...''

రహీం కాసేపు నిలబడి, తిరిగిచూస్తూ తిరిగిచూస్తూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి, మూలనున్న గునపాన్ని చూస్తూ వెల్లకిలా పడుకున్నాడు రుద్రమూర్తి. దోమలు ఈలలతో పొడుస్తున్నా, మస్కిటోఫాయిల్ వెలిగించుకోలేదతను. చెవిదగ్గరున్న కిందివాటాల మరుగుదొడ్ల తలుపులు డర్ బుర్ మంటున్నా, కాంపోజ్ మాత్రలు మింగలేదు. గాలి కదలక, ఉక్క పోసేసి, గుబగుబ మంటూ చెమట పట్టేస్తున్నా, అట్టముక్కతో విసురుకునే ప్రయత్నం చెయ్యలేదు. తన చాప కింది తూములో జరజరమంటూ పెంట కదిలిపోతున్న చప్పుడు వినిపిస్తున్నా, ఆగి ఆగి కంపు గుప్పుగుప్పుమంటూ ముఖాన్ని మింగేస్తున్నా, అతను చీదరించుకోలేదు. అతను యిప్పుడు అసహ్యించుకుంటున్నది వల్లకాటిని!

వల్లకాటిని గురించి తాను అనుకున్నదంతా పొరబాటు! అది మనిషిని వూరడించడానికి పనికివచ్చే కల్లబొల్లి ఓదార్పు మాత్రమే! పెంటను భరించలేదు మనిషి. ఇంట్లోనుంచి తరలించిన పెంటను పాతిపెట్టటం కోసమే వల్లకాడు. అక్కడ శరీరాలు కుళ్ళిపోతాయి. కాలిపోతాయి. మట్టిలో కలసిపోతాయి. అక్కడ జీవంలేదు జీవం లేని చోట సుఖమూలేదు. శ్మశానంలో సమానత్వం నిర్జీవమైనది; అది ప్రాణవంతమైనది కాదు.

మనిషికి సుఖమూ, శాంతీ, తృప్తీ, ఏది కావాలన్నా, బతికి వున్నప్పుడే అది సాధ్యంకావాలి. మనిషిచచ్చాక. కష్టాలూ చస్తాయి, సుఖాలూ చస్తాయి. కష్టసుఖాలు రెండూ లేని మరణానంతరస్థితి ప్రతివాడికీ తప్పనిసరి. అందుకు జాలిపడటం గానీ, మురిసిపోవటం గానీ అవివేకం. చావును ఎదుర్కొనేలోపున, మనిషి మనిషిగా బతకలేకపోవటం మాత్రం ఘోరమైన దురన్యాయం.

మిద్దెలూ మేడలూ సోఫాలూ ఫ్యాన్లూ ఇలాటివన్నీ నాకు కావాలనుకుంటే, అది అత్యాశే! సంపద లేకపోతేనేం, నిరాడంబరంగా బతుకు. అంతేకానీ, అసహజంగా మాత్రం బతక్కు! సహజంగా బతకలేకపోతే, నువ్వు పీనుగువే!

అర్ధరాత్రి దాటింది. రుద్రమూర్తి లేచి కూర్చున్నాడు. ఇల్లంతా కలయజూశాడు. బలపం తీసుకుని నేలమీద సరళరేఖ గీచాడు. సినిమా థియేటర్, లక్ష్మీనగర్, మంత్రిగారు కట్టించిన కాలనీ, రచ్చబండ, జెండా బిల్డింగ్, తాను కూర్చునివున్న రుద్రభూమీ గుర్తించాడు. ఇవన్నీ ఒకే నేల మీదున్నాయి ఈ క్రమాన్ని తారుమారుచేసి, పేకముక్కల్లా ఎలా కలిపినా, తన స్థానం మాత్రం అట్టడుగునే! తనది అధోగతి! ఇది యిల్లు కాదు. వల్లకాడు. మనిషి ప్రాణంతో వుండవలసిన చోటు కాదు. ఇది బతుకు కాదు. పీనుగు నడయాడటం వంటిది. ఈ వైపరీత్యం సహించరానిది! ఈ మురికి గుంటమీద ముడి కిరసనాయిలు కుమ్మరించాల్సిందే!

ఈ అస్తవ్యస్తతను, అన్యాయాన్నీ సృష్టించి బతకనిస్తున్నదెవరు? ఈ విషపూరిత గ్రహశకలాన్ని ఈ సుందర భూతలానికి లంకె వేసిందెవరు? మనిషిని ఊపిరివున్న పీనుగుగా మార్చిందెవరు? ఎవరైతేనేం, ఈ వ్రణాన్ని శస్త్రంతో ఖండించవలసిందే! ఈ వికృత సృష్టిని విలయం చెయ్యాల్సిందే!

రుద్రమూర్తి పైకి లేచాడు. కట్టెపుల్ల లాంటి చేతితో గునపం అందుకున్నాడు. బరువుగా వుంది. మళ్ళీ దాన్ని గోడకు చేర్చాడు. ముందుకీ వెనక్కీ ఇరువైపులకీ అడుగులు వెయ్యటం మొదలెట్టాడు. అవక తవక అడుగులే కాసేపటికి లయబద్ధమైనాయి. అడుగుల వేగం, చేతుల వూపు ఎక్కువైనాయి. చివాలున గునపం అందుకున్నాడు రుద్రమూర్తి. తనకు మూడో కన్నేదో పొడుచుకొచ్చిన అనుభూతీ, కులగిరులను సైతం కూళ్ళగించగల శక్తీ కలిగాయతనికి. గునపాన్ని త్రిశూలంలా గిరగిరా త్రిప్పుతూ, తాండవం చెయ్యసాగాడు. కళ్ళమీద రెప్పపడటం లేదు. అతని పద తాడనంలో, నడుము వొంపుల్లో, భుజాల కదలికలో, వేయి ఢమరుకలు ముక్తకంఠంతో నినదించాయి.

రుద్రమూర్తి తనను తాను శాశ్వతంగా మరిచిపోయాడు. అతనిప్పుడు మరో కొత్తశక్తి. రుద్రతాండవంచేస్తూ, మధ్యగోడను గునపంతో ఖంగు ఖంగున మోదసాగాడు. లయను నియంత్రించే ఘంటానాదంలా, ఆ గునపంపోట్లు తాండవ రుద్రమూర్తికి భావావేశ శిఖరాలదాకా సోపానాలు వేశాయి.

పది, పదిహేను నిముషాలపాటు ఖంగు ఖంగుమన్న ధ్వని ఆ వీధి అంతటా ప్రతిధ్వనించింది. వీధి వీధే మేలుకొన్నది. జనం సందులో జొరబడ్డారు. కిటికీలోంచి లోపలికి చూశారు మధ్యగోడ విరిగిపడి వుంది. దానికింద రుద్రమూర్తి అచేతనంగా పడివున్నాడు, తనువు చాలించిన అవతారమూర్తిలా!

రుద్రమూర్తి కథ ముగిసింది.

పట్టాభి ఆ గోడను తిరిగి కట్టించాడు.

ఒక పీనుగు ఆ యింటిని ఖాళీచేసి వెళ్ళిపోగానే, మరో పీనుగు వచ్చి కాపురం పెట్టింది.

ప్రభుత్వ సహాయంతో కట్టిన సినిమా థియేటరూ, ధనవంతులు వుంటున్న లక్ష్మీనగర్, పేదవాళ్ళ కోసం కట్టిన కాలనీ, ముష్టివాడు తిష్ఠవేసిన రచ్చబండ, జెండా బిల్డింగు వెనక రుద్రభూమీ — అలాగే వున్నాయి, ఒకే భూతలం పైన.

నేలమీద మనుషుల నీడలు, ఆ నీడల్లో వాళ్ళ మృత్యుచ్ఛాయలూ తిరుగాడుతూనే వున్నాయి. నింగిలో సిమెంటు జెండాలు కదలకుండా మెదలకుండా అలాగే నిలబడివున్నాయి.

రుద్రమూర్తి మతిచలించి చావును నెత్తినేసుకున్నాడని వ్యాఖ్యానించారు జనం. అతను ఎదిగినంత ఎత్తుకు ఎదగడానికి వాళ్ళకు యింకెంతకాలం పడుతుందో మరి!

# రేపటి ఉదయ గీతం

## జనజ్వాల

ఉక్కు పాదాల క్రింద
  నురగ నెత్తురు కక్కుంటూ
గిల గిల తన్నుక చస్తున్న
చంద్రుున్ని చూచినపుడు
జాలితో ఏడ్చాను

కాని ... ... ఆ
ఉక్కు పాదాలక్రిందే
సూర్యుడు ఉదయించడం...చూసి
ఊపిరిపీల్చుకుంటూ
ఆనందించాను.

ఆ ఆనందములో
నా కంఠంధ్వనిస్తూ
స్వాగత గీతం పాడింది ... ఆ
ఉదయ భాస్కరునికి

జాలి దుఃఖము ఎగిరిపోయినా
నా కంఠంలోంచి ... ...
రేపటి ఉదయగీతం...కూడ
వినిపిస్తుంది!